# మమత మానవతా




ఉత్తరం అందుకుంటూంటే చేతులు వణికినట్టయింది. శారద మనస్సు కీడు శంకించినా, ఆమెబుద్ధి ధైర్యంగా లోనికి వచ్చి టేబిల్ మీద ఆలేఖను పడేసి ఇంటిపనులు చూసుకోసాగింది.

మరోకొన్ని నిముషాలు గడవగా టేబిల్ దగ్గరకు వచ్చి ఉత్తరం చూసింది. చిరునామా ఇంగ్లీషులో వుంది. దస్తూరీ పరిచయిమైంది కాదు. పుట్టింటివారు గాని, అత్తవారి తరఫునగాని వచ్చినది కాదది. ఆయన స్నేహితు లెవరో వ్రాసివుంటా రనుకుంది. కానీ ఆ ఉత్తరంలో ఏదో విశేషం ఆమెను ఆకర్షిస్తూంది. ఆకర్షించడ మేమిటి ఏదో సంశయం ఆందోళన రేపుతున్నది. ఎందుకలా అనిపించిందో తెలీయదు.

యక్షిణీ ఏదో రహస్యం ఉన్నదని చెప్పినట్లు, మనస్సు ఆలేఖను చదవమని ప్రేరణ చేసినట్లు అయింది. వాకిలి తలుపు గడియపెట్టి వచ్చింది. కవరు చించింది. చేతులు నిజంగా వణికేయి. పెనిమిటికి వచ్చిన ఉత్తరాలు ముందుగా చదివే అలవాటు ఏనాడూ తనకులేదు. యీనాడు ఒక తప్పుపనే చేస్తున్నట్లు బాధపడింది. అయినా మానలేదు.

ఉత్తరం చదవడం ప్రారంభించింది. విజయనగరంనుండి వ్రాసిన దది. ఎవరు వ్రాశారా అని సంతకం చూసింది. 'ఆదిమూర్తి' – ఈపేరు ఎక్కడో ఎప్పుడో విన్నది. తమబంధువుల్లో ఎవరూ అట్టిపేరు కలవారు లేరు.

ఒక స్త్రీగురించి వ్రాస్తున్న వుత్తరంఅది.

'శ్యామల' ఎవరు? ఈయినకు శ్యామల ఏమవుతుంది? ఆమెకు వచ్చిన కష్టం విశదంచేస్తూ అవసరమైన సలహా యివ్వవలసిం దని కోరుతూ వ్రాయ బడిం దా ఉత్తరం.

కొంపదీసి యీ శ్యామల ఆయన ప్రథమకళత్రమా! పూర్వ పరిచయాలు మళ్ళా కదులుతున్నాయా? యీ అభిప్రాయమే నిజమవుతే యింకేముంది? ఆ సవతి మళ్ళా ప్రత్యక్షమవుతే తన బ్రతుకు బండలపాలే అవుతుంది. తన పిల్లలూ తనూ నిలువనీడలేనివారవుతారే! భాగవంతుడా ఏమిటీ గాలివాన! ఎందుకు నా బ్రతుకులో కల్లోలం రేపుతున్నావు?! దయ చూపించు తండ్రీ! ఆయన ఏ అప మార్గాల్లోకీ వెళ్ళకుండా రక్షించుతండ్రీ! అనుకుంటూ కంట నీరు పెట్టుకుని ప్రార్థించింది.

వెంటనే పైకవరు చించివేసింది. ఉత్తరాన్ని నలిపి గదిమూల విసరి వేసింది.

భవిష్యత్ ఊహించుకుంటూంటే ఆమె దుఃఖం కట్టలు తెగి ప్రవహించ సాగింది. ప్రక్కమీద వాలి వెక్కి-వెక్కి రోదించింది. శారదకి ఇంత దుఃఖం ఎప్పుడూ రాలేదు. ఒకవైపు దుఃఖం, మరోవైపు భయం, ఇంకోవైపు ఆదిమూర్తిమీదా, శ్యామలమీదా కోపం ఆమె మనస్సులో కమ్ముకోసాగాయి.

ఇన్నేళ్ళ తరువాత, తనభర్త, తను ప్రాణాధికంగా ప్రేమించి ఆరాధించే తన మనోనాధుడు, అన్యకాంతగా పరిగణించ బడిన ఆమెపట్ల ఆసక్తి ఎందుకు కన పరుస్తున్నారు? ఇందలి అంతరార్థం ఏమిటి? దాని పరిణామం ఎల్లావుంటుంది? ఒకటివెంబడి మరోటి పెక్కు ఆలో చనలు వస్తున్నకొద్దీ భయాందోళనలు అధికం కాజొచ్చాయి.

కన్నీటితో తలగడా తడుపుతూ అలా ఎంత సేపున్నదో ఆమెకే తెలియదు. పిల్లలు బడినుంచి వచ్చి తలుపు కొడు తూంటే లేచి తలుపు తీసింది.

* * *

వెంకటేశ్వర్లు వచ్చేసరికి పిల్లలు భోజనాలు చేశారు. కాళ్ళూచేతులు కడు క్కొని పట్టుపంచతో పీటమీద కూర్చున్నాడు వెంకటేశ్వర్లు. పలుక రింపుగాని, నవ్వుముఖంగాని లేని శారద నిశ్శబ్దంగా వడ్డించింది.

తన కంచం ఎదురుగా ఉండవలసిన శారద కంచం లేదు. శారద ఎదుట కూర్చోలేదు. నేతిగిన్నె పట్టుకొని మౌనంగా నిల్చున్న శారద ముఖంలో కలతా, కోపమూ స్పష్టంగా కనిపించాయి వెంకటేశ్వర్లుకు. కారణం ఏమీ ఊహించుకోలేకపోయేడు.

అన్నం కలుపుతూ మందహాసంతో అన్నాడు:

"ఏమిటి విశేషం? శ్రీమతిగారు మౌనముద్రాలంకృతులై వున్నారు."

శారద ముఖం ముడుచుకు గబుక్కున అక్కడినుండి పనివున్నట్లు వంటింటి లోకి వెళ్ళిపోయింది.

ఆవకాయ తెచ్చి వేసి మారు మాటాడక నిల్చుంది.

వెంకటేశ్వర్లుకు ఇవేమీ అర్థం కాలేదు

ఏదో గట్టివిశేషమే వుండాలనుకుని తనూ తటస్థంగానే భోజనం చేసి వెళ్ళిపోయాడు.

ఆరోజంతా శారద వైఖరిలో మార్పు లేదు. తన పనులు తను చేసుకుపోతున్నది. ఆవిడ ధర్మాన వేళకింత భోజనాది సదుపాయాల లోపం చేయలేదు కనుక వెంకటేశ్వర్లు కాలక్షేపం చేసుకువచ్చాడు.

రాత్రి యింటికి వచ్చి భార్యను కుశల ప్రశ్న వేయలేకుండా వుండలేక పోయాడు,

"ఏమిటి శారదా! ఉదయంనుండీ అలావున్నవేమిటి? ఒంట్లో బాగాలేదా?"

మాట్లాడలేదు శారద.

వెంకటేశ్వర్లుకు ఇంకా మనస్సుండబట్టలేదు.

"అడిగితే చెప్పవేమి? డాక్టరు దగ్గరకు వెళ్దామా? ఒంట్లో ఏమిటి?

"ఏమీలేదు. జబ్బేమీ ముంచుకు రాలేదులెండి!"

కర్కశమైన ఆమె జవాబు బాధ కల్గించినా, వెంకటేశ్వర్లు అంతతోనే [illegible] అలా వున్నావు? ఎవరితోనైనా ఘర్షణ పడ్డావా?

ఘర్షణాలేదు; సరసమూలేదు. నాకే ప్రమాదమూ లేదులెండి"

"ఏమిటా పంతం? మనసులో బాధపడి ప్రయోజనం లేదు. సంగతి చెప్పకూడదూ?''

"నన్నేమీ ఒత్తిడి చేయకండి" అని మౌనం వహించింది శారద.


శారద తత్వం ఎరిగిన వెంకటేశ్వర్లు ఇంకేమీ మాట్లాడలేదు. చిలికి చిలికి గాలివాన అవదుకదా అని మాత్రం అనుకున్నాడు మనసులో

ఈ సంఘటన జరిగిన మూడో రోజున ఆఫీసుకు వెళ్ళేసరికి టెలిగ్రాం వచ్చివుంది.

విప్పి చూస్తే విజయనగరంనుండి ఆదిమూర్తి యిచ్చిన టెలిగ్రాం అది. "శ్యామల అవసర సహాయం కోరుతూంది. వెంటనే బయలుదేరి రావలసింది." అని మాత్రం వుంది.

వెంకటేశ్వర్లు కీడు శంకించాడు. శారదలో మూడు రోజులనుండీ వచ్చిన మార్పునకూ ఈ టెలిగ్రాముకూ ఏదో సంబంధం వుండాలి. ఉత్తరం ఏదైనా వచ్చిందేమో ముందుగా అని అనుమానించేడు.

తన బంట్రోతును పంపి పోస్టుమెన్‌ను భోగట్టా చేస్తే, నాలుగురోజుల




క్రిందట ఒక కిటరు ఇచ్చినట్లు చెప్పేడు. విజయనగరం పుత్తరమే అది. దానికి జవాబు లేకపోవడంవల్లనే టెలిగ్రాం వచ్చిందని వెంకటేశ్వర్లు భావించాడు.

'ఎన్నో ఏళ్ళ తర్వాత "శ్యామల" గురించిన ప్రశక్తి రావడం ఏమిటి? తనెందుకీ సహకారంలో ప్రమేయం కల్పించుకోవడం. ఇందువల్ల వచ్చే అనర్థాలకు కొంతబాధ్యత వహించవల్సి వుంటుందేమో! అయినా తను తొలి నుంచీ "మెత్తని మనస్సు" చూపడం వల్లనే ఇప్పుడీ అవసర పరిస్థితిలో సహకారం అర్థించడం జరిగింది! కానీ శారద యీ సంగతి తెలుసుకొనివుంటే ఏదో రభస జరగవలసి వుంటుంది!' యిలాగ్గా మనసులో భావించుకున్నాడు వెంకటేశ్వర్లు.

సంగతి శారదకు తెలిసినట్టే. అయినా తన కేమీ సంబంధం లేనట్టే ఉండాలి. కదిపితే ఇంకా పరిస్థితి చెడవచ్చు అనుకున్నాడు.

తను అక్కడికి ఎలా వెళ్తాడు? వెళ్తే ఎట్టి విపరీత పరిణామాలు రావచ్చునో వూహించుకోగలడు వెంకటేశ్వర్లు.

వెంటనే తన మేనల్లుడు రామచంద్రానికి లేఖ వ్రాశాడు. విజయనగరం వెళ్ళి ఆదిమూర్తిని కల్సుకోమనీ, అవసరమైనట్టు చేయవల్సిందనీ కోరాడు. రామచంద్రం విశాఖపట్నంలో మాష్టరీ చేస్తున్నాడు. మామయ్య అంటే విశేష గౌరవాదరాలు కలవాడు. అతనికి వారెవరూ తెలియదు. ఆదిమూర్తిని మాత్రం రెండు దఫాలు కల్సుకున్నాడు. శ్యామలను చూడనేలేదు రామచంద్రం. ఆవిడగురించి వివరాలు అంతకంటె

తెలియవు. మామయ్యకు పదేళ్ళక్రితమే ఒక పెళ్ళి అయిందనీ, ఆ భార్య అత్త వారితో తెగతెంపులు చేసుకొని పుట్టింటికి పెళ్ళిపోయిందనీ మాత్రం విన్నాడు. అప్పుడు తనది చదువుకొనే బాల్యావస్థ.

రామచంద్రం మామయ్య ఆజ్ఞను శిరసావహించి స్కూలుకు శెలవుపెట్టి విజయనగరం బయల్దేరేడు.

ఆదిమూర్తియింట శ్యామల పరిచయం అయింది. ఆమె నిరాడంబరతా, వినయం రామచంద్రం మనస్సులో ఒక పవిత్రభావాన్ని ఏర్పరచేయి. ఈవిడా - అత్తవారితో జగడమాడి కాపురం తెంచుకొని పుట్టింట చేరింది!' అనే ఆశ్చర్యం కల్గిందతనికి.

యౌవనవతి, సుశీల, విద్యావతి అయిన యువతి కాపురం చెడగొట్టుకోడానికి దారితీసిన ప్రబలకారణాలగురించి రామచంద్రం ఊహించలేకపోయాడు.


ఆదిమూర్తితో తను చేయవలసింది ఏమని అడిగాడు.

ఆయన పరిసితులు వివరించేడు: "జీవనాధారం కూర్చే ఏదో ఒక వృత్తి జీవనశక్తి ఆమెకు లభించాలి. తాను యితరులమీద ఆధారపడకుండా బ్రతుకు వెళ్ళదీసుకునేశక్తి ఆమెకు కూర్చాలి. మీరు ఆలోచించండి. ఎలా చేస్తే బాగుంటుందో!''

రామచంద్రం ఆదిమూర్తితో సవిస్తరంగా పరిస్థితులు చర్చించాడు.

శ్యామలపేరున బ్యాంకులో కొంత డబ్బుంది. నాయనమ్మ శ్యామల స్థితి గ్రహించి తనదైన రెండువేల రూపాయలు శ్యామలపేర బ్యాంకులో వేసింది. ముసలిది కాలం చేయగానే శ్యామలను పీడించడం ప్రారంభించారు - ఆసొమ్ము తీసుకువచ్చీమని తండ్రి సాధింపు రాను రాను అధికమయింది. తను అత్తవారిల్లు వదలి పుట్టింట పడివుంది. గుడ్డిలో మెల్ల అన్నట్టు మెట్రిక్ కు కట్టి ప్యాసయింది. కాని ఎంతకాలం యీ పుట్టింట అప్యాయత కొనసాగుతుంది. తనకున్న కొద్దిఆధారం బ్యాంకులోవి డబ్బు - అది తండ్రిచేతిలో పోస్తే మర్నాడు తనను ఒంటరిని చేసి ఏ కారణంవల్లనో వెడలనడిపిస్తే బ్రతుకు సాగడం ఎలా?

శ్యామల బ్యాంకులో డబ్బు తీయడానికి నిరాకరించింది. తల్లిదండ్రులు నిర్దాక్షిణ్యంగా ఇంట్లోంచి పొమ్మన్నారు. బిడ్డమీది వాత్సల్యబంధాన్ని తెగతెంపులు చేసుకొని ఇంటినుండి గెంటివేయడం ఆమెను కృంగదీసింది. యీ విపత్తును అంతా పుత్రికా వత్సలతతో తనను అభిమానించే ఆదిమూర్తి అమ్మగారితో చెప్పి ఏడ్చింది. ఆమె కన్నబిడ్డలా అదరించి చేరదీసింది. ఏదో మార్గం కానవచ్చేవరకూ తన యింట్లో నిస్సంకోచంగా ఉండమందామె. ఆదిమూర్తి వెంకటేశ్వర్లు మిత్రుడు.




రామచంద్రం మామయ్యా దగ్గరకు బయల్దేరేడు. సంగతులన్నీ వివరించి చెప్పాడు.

రామచంద్రం తన యింటికి రావడంలో ఏదో ఆంతర్యం వుందని శారద పసికట్టింది కానీ ఏమనడుగుతుంది. కుశల ప్రశ్నలతో ఆహ్వానించి ఆదరించక తప్పలేదు.

వెంకటేశ్వర్లు ఆఫీసులో కూర్చునే, రామచంద్రంతో అన్ని విషయాలూ మాట్లాడాడు.

తన మనస్సులోఉద్దేశం వెల్లడించేడు. "స్త్రీ – భర్తృవిదూర – తల్లిదండ్రులు అక్రమం చేయనెంచారు. అత్తవారిచేతా, కన్నవారివల్లా అన్యాయానికి గురికాబడిన అబల ఆమె. మానవత్వంబట్టి మాత్రమే ఆమెను ఆదుకోవలసిన అవసరం వుంది. బంధుత్వాలు, అనుబంధాలు అలావుంచి, తోటిమనిషి ఆపదలోవున్న అబలకనుక సహాయం అందీయవలసిన ధర్మం మనమీద వుందని మాత్రం నేను ఆలోచిస్తాను."

మామయ్య మనస్సు రామచంద్రం అర్థం చేసుకున్నాడు. ఉదారమైన అతని అభిప్రాయంలోని మానవతా దృక్పథం చాల యుక్తమయినదిగా భావించాడు.

* * *

శారద కుదుటపడేసరికి నెల్లాళ్ళు పట్టింది. అయినా ఆమె మనస్సులోని శంక తొలగిపోనేలేదు.

రెండు కత్తులు ఒక ఒరలో ఇముడవు అనే సామెత చాల వాస్తవమైనది. స్త్రీ తన పతి అన్యస్త్రీని అభిమానించడం అదెందుచేతో సహించలేదు. తన భర్త అన్యకాంతాహృదయచోరుడు కాకూడదని కోరుకుంటుంది. అది స్త్రీ తత్వం. తనకు అనుమానం కల్గితే ఆ సంసారం నిత్యభీభత్సమయం అవుతుంది. ఏదో తగవు, ఏదో కలత, ఏదో నలత!

పురుషునికి అనుమాన మున్నా యీ చిక్కు తప్పదు. పురుషుడు స్త్రీని అణగద్రొక్కుతాడు కర్కశంగా హింసిస్తాడు. స్త్రీ కలత పెడ్తే పురుషుడు కొట్టడమూ, తిట్టడమూ, ఇంటినుండి తరిమివేయడమూ వంటి దారుణ హింసలకు భార్యను గురిచేస్తాడు. అనుమానం అట్లాంటిది!

శారద కాపురంలో అప్పుడప్పుడు చిన్న చిన్న గాలిదుమారాలు రేగేవి.

ఒట్టిపుణ్యానికి ఇంట్లో కలత తలెత్తడము వెంకటేశ్వర్లుకు బాధగా వుండేది. ఒక్కప్పుడు అతని ఒళ్ళు మండేది. కోపంలో భార్యను బాధించకనూ తప్పేది కాదు. ఓమారు మాటపట్టింపుమీద శారదను పుట్టింటికి పంపించి ఆరునెలల వరకూ తిరిగిచూడలేదు. శారద తల్లిని తోడుతెచ్చుకొని కోరకనే ఇంటికి వచ్చి కూర్చుంది. అప్పటినుండీ ఆమె ప్రవర్తనలో ఒకింత మార్పు కనిపించింది. వెంకటేశ్వర్లు అనవసరంగా ఆమెను ఎన్నడూ బాధించలేదు. హద్దుమీరినప్పుడు మాత్రం ఆమె స్వభావం ఆమెకే విపత్తు తెచ్చిపెడుతూవుండేది. ఆవేశం కల శారద మనస్సు కోరి తెచ్చుకున్న బాధలే అధికం! ఆ బాధలు యింటిల్లిపాదినీ అలముకునేవి. ఆనందానికి దూరం చేసేవి.

## 2

ఏళ్ళు గడిచాయి.


శ్యామలకు యీ యింటి పరిస్థితులు తెలిశాయి. తను కారణంగా యీ కొత్త కలతలు లేవడం అన్యాయ మనిపించిందామెకు. శారదకు పరిస్థితులు వివరిస్తే కొంతమేలు కలక్కపోదని ఆమె విశ్వాసం.

శారదపేర ఒక ఉత్తరం వ్రాసింది.

శారద తన పేర వచ్చిన పెద్దకవరు చూచి ఆశ్చర్యపడింది. అంత బరువు గల కవరు ఏనాడూ తనకు రాలేదు.

"చెల్లీ!

ఈ సంబోధన నీకు ఆశ్చర్యము కలిగిస్తుంది. 'నాకు అక్క లెవరూ లేరే! ఇంత చనువుగా ఉత్తరం వ్రాస్తున్నారెవరమ్మా' అని వింతపడతావు, నిజమే. ఇంతవరకూ నేను నీకు ఆత్మీయురాలనవలేదు. మన బంధుత్వం మనకట్టి అవకాశము ఇవ్వలేదు. పరిస్థితులు యీ ఆత్మీయభావాన్ని మరింత దూరం చేయడానికే పురికొల్పుతాయి. ఇక మనం దగ్గరయే దెట్లా?



"నే నీవేళనుంచీ గోహత్యా నివారణ సంఘంలోంచి విడిపోతాను."

ఇటువంటి సమయంలో సోదరభావం కుదుర్చుకొనే కృషి మన ఇరువురమే ఎందుకు చేయరాదు? ప్రయత్నంలో తప్పేముంది? కయ్యానికి దిగలేదుగా మనం. మనసులు కలిసే, మైత్రీభావానికి దారి తీసుకుంటున్నాము.

నిజంగా నేను నీకు అక్కను చెల్లీ! బహుశా మనం పూర్వజన్మలో ఒకతల్లి బిడ్డల మయి వుండవచ్చు. అప్పుడు మనం ఒకే కోర్కెతో, ఒకే ఆశతో మన ఇలవేల్పుని ఆరాధించి వుండవచ్చు. ఆ దేవి మన ఇరువురి కోర్కెల ఆంతర్యాన్ని తెలిసి ఆశ్చర్యపడి వుంటుంది. మనల్ని వేరుచేయడంగానీ, మనల్ని కలపడంగానీ, మన యిరువురి కాంక్షలను యీడేర్చడంగానీ ఎట్లాగా అని ఆ తల్లి కాస్త తటపటాయించి వుంటుంది. అయితే ఏదోలా మన ఈప్సితాలు నెరవేర్చాలి.

నేను అక్కను కదా! ముందు నా ఆశ ఫలింపజేసింది. నిజమే. నేను కోరింది పొందాను. భర్తగా నా కోరిన పెన్నిధిని పొందాను. ఆ కోర్కెలపంట అనుభవించాలనే ఉబలాటంతో నా మనస్సు పరుగులు తీసింది. ఏమా పరుగు! ఏమా వేగం! నేనా సందడిలో అడ్డువచ్చిన సమస్తాన్నీ నిర్లక్ష్యంగా ప్రక్కకి నెట్టివేయదలచాను.

నా ఆనందానికీ, ఆవేశానికీ ఏ ప్రతిబంధకమూ సహించలేకపోయేదాన్ని.

కానీ ఎందుకనో నేను పొందిన ఫలం నా చేతికి సరిగా అందనేలేదు. మార్గ మంతా అంతరాయాలే. నా ఆకాంక్షలకు అవరోధాలు నానాటికి వింతరూపాలు దాల్చాయి. అత్తవారిల్లు నా కొక్క కారా గారం అనిపించింది. నే నా రాటుపోటులు సహించలేకపోయాను. ఏడ్చాను, మొత్తుకున్నా. స్వేచ్ఛ నీయమని ప్రార్థించాను, ప్రాధేయపడ్డాను.

నా మనస్సు మరి సహించలేక పోయింది. నా స్వేచ్ఛాసుఖాలు భగ్నం చేసే ఆ యిల్లే వదలిపోవా లనిపించింది. నా జీవితానందాన్ని నిర్లక్ష్యం చేసే ఆ బాంధవ్యాన్నే దూరం చేసుకోసువా లనిపించింది.

నిరాశా, దైన్యం నన్ను క్రుంగదీశాయి.

నా ప్రియుడు నన్ను లాలించి పాలించడానికి అందుబడిలోలేడు. విముక్తి మార్గం కనిపించలేదు. నా ఉడుకురక్తం సహించలేదు. అన్నిటినీ విడచి, నా కాంక్షల గమ్యాన్ని, నా పూజాఫలాన్ని అనుభంచకుండానే ఆ స్థానం విడిచిపెట్టి పుట్టింటికి చేరాను. అంతే, అంతతో కాపురమే తెగతెంపుచు చేసుకున్నాను.

ఈ పాటికి, నీకు ఈ అక్క ఎవరో చూచాయగా అర్థమై వుంటుం దను కుంటాను.


నేను పుట్టింటికి వచ్చిన చాలనాళ్ళకు, నీవు, నా స్థానం పొందావు. అవును, నా చెల్లి నాతో సమానంగానే పూజలు చేసింది. నావలె ఒక సహృదయుని కోరి దేవిని అర్థించింది.

మన మిర్వురమూ కోరింది ఒకర్నే అయ్యుంటుంది చెల్లీ! మన కోర్కెల ఫలమే యీ రూపంలో నేను అజ్ఞాత వాసంలోకి వెళ్ళడం, నీవు ప్రయోజనం పొందడమున్నూ.

నా కోర్కె సగం ఫలవంత మయింది. నీ కోర్కె ఫలప్రద మైంది. అయితే జీవితంలోని చీకటి వెలుగుల్లో చీకటి నావంతు వచ్చింది. వెలుగురేకలు నీకు అందేయి. నీవు ఆ ప్రియుని పొందావు.

చెల్లీ! నా ఆరాధనలో ఏదో దోషం వుండివుంటుంది. నా ఆశలలో ఏదో దౌష్ట్యలేశం వుండివుంటుంది. అందుకే నా ప్రియునికి నే నింతదూర మయ్యాను. నా చెల్లెలు సన్నిహితమై సౌభాగ్య మనుభవిస్తున్నది.

కలకాలం అలా సౌఖ్యం అనుభవించు చెల్లీ! నాకు లేదని ఈర్ష్య పొందడంలో ఏమిలాభ ముంది? నా మనో మాలిన్యం నన్నింకా చెరుపుతుంది; కానీ, యోగించదు కదా! వద్దు, నా కే దురాశావద్దు! నా కెట్టి పాపిష్టికాంక్షా లేదు. నా చెల్లి, నా జన్మాంతర సహజీవని, నా ప్రియసోదరి వర్ధిల్లడమే నే కోరుతా. నన్ను నమ్ము. నా హృదయం అర్థం చేసుకో. నే నెట్టికీడూ తలపెట్టలేదు చెల్లీ! నీ సాంసారిక జీవన భవనంలోకి కూడా




రాలేను. నీ మనసు కలత పెట్టలేను. నీ దుఃఖం నాకు ఆనంద మనుకున్నావా? నీ కన్నీరు నాకు పన్నీటిజల్లు అనుకున్నావా? కాదు, ఎన్నటికీ కాదు. నేను నీ అక్కనుసుమా! సవతినికాను, నీ సహోదరినే సుమా!

నాకు ఫలసిద్ధి నీయిని పూజనీకు పరిపూర్ణ సిద్ధి నిచ్చింది. నీవు పొందే వావరం. దేవి నిన్ను కరుణించింది. ఆసుఖ సంతోషాలు నీవే అనుభవించ అర్హురాలవమ్మా! నిన్ను అడ్డగించేవా రెవరు? నీ వరాన్ని దోచుకోడానికి ఎవరికి తరమౌతుంది?

చెడు శంకించకు! మేలే తల పోస్తూండు. నీకు తప్పక మేలే కల్గుతుంది. ఉంటా.

నీ ప్రియసోదరి

శ్యామల"

లేఖముగించి దీర్ఘ నిశ్వాసం వదలింది. ఉత్తరంలో ఎక్కడా శ్యామల చిరునామా లేదు. జవాబు వ్రాసే వీలులేదు.

నిజంగా ఈవిడ యింత మంచి మనిషా? మరి ఎందు కలా కాపురం కడబెట్టుకుంది? క్రిందటి జన్మలో ఇరువురం అప్పచెల్లెళ్ళమట! తను చీకటి

లోకి వెళ్ళిపోయి నాకు వెళ్లులు పంచి యిచ్చిందట ?

ఎంత తమాషాగా వ్రాసింది ! వాస్తవమే అనిపిస్తూందామాట ! భర్తలో ఏదోషమూ లేకుండానే, అత్తవారు సరిగా చూడలేదని, పండంటి కాపురం వదలుకొనిపోవడం, నా కా స్థానాన్ని అప్పగించడానికే అనిపిస్తోంది !

ఈమె మళ్ళా నా సంసారంలో ప్రవేశిస్తే !? ఎల్లా సాధ్యమౌతుంది ? ఆయననాకు అన్యాయం చేస్తారనడంలో ఎంత వీలుంది ? ఇది అనుమానం ! కేవలం భ్రాంతేనేమో యిది ? భ్రాంతుల్ని పెట్టుకొని నాలో నేను కుళ్ళడమేకాకుండా ఆయననూ బాధిస్తున్నానే ! యిలా జరుగవచ్చునా ! ఆయనను కలతపెట్టి నేను బావుకునే దేమిటి ? ధైర్యంగా యీ సమస్యను ఎదుర్కొంటాను !

* * *

ఇలా భావిస్తూండగానే, వెంకటేశ్వర్లు ఇంట్లో అడుగు పెట్టాడు. భార్యచేతిలో లేఖ చూశాడు. ఆమెముఖంలో ఆలోచనా, ఆవేదనా పరికించాడు. 'మళ్ళా ఏదీ ముంచుకురాలేదుకదా !' అనుకుంటూనే ప్రశ్నించాడు.

''ఎక్కడ్నించి శారదా ఉత్తరం ?"

''ఎక్కడ్నించా ?"అని బాధను దిగమ్రింగుకుని, పెదవి కొంచం పంటితో నొక్కిపట్టి "మీరే ఇది చూడండి !" అంటూ భర్తకు అందించింది లేఖ.

వెంకటేశ్వర్లు ఆ కవరును టేబిలు మీద వుంచి బట్టలు మార్చుకొనివచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

పిల్లలు అన్నాలకు కూర్చున్నారు. పెనిమిటికీ కంచం పెట్టింది. ఉత్తరం చదవటానికి కొంచెం వ్యవధి యిచ్చింది. పదినిముషాల తర్వాత గదిలోకి వెళ్ళింది శారద.

"భోజనం చేయాలనిపించలే దేమిటి. ఉత్తరం చదువుతూంటే," ఎత్తిపొడవకుండా ఉండలేకపోయింది.

వెంకటేశ్వర్లుకు లేఖ చదువుతూంటే కంట నీరు కమ్మింది. శారద రావడం గమనించి తన బాధను దిగమ్రింగుకొని, కన్నులతడి భుజానికి అద్దుకుంటూ, "వస్తున్నా" అన్నాడు సమాధానంగా.

భోజనంచేసి పదినిముషాలు విశ్రాంతి తీసుకొని ఆఫీసుకు వెళ్లిపోయాడు. అతని మనస్సు ఏమనుకుంటో తెలుసుకోవాలని వుంది శారదకు.

రాత్రి భోజనాలు చేసి ఇంటి సర్దుబాట్లు అయిన తర్వాత శారద పడకగది చేరుకుంది.

వెంకటేశ్వర్లు వాలుకుర్చీలో పుస్తకం ముందుంచుకొని ఏవో ఏమిటి – ఉదయం లేఖగురించే ప్రస్తావన తీసుకురావాలని ఆలోచిస్తున్నాడు

శారద మనసులో మాట గ్రహించినట్లు అన్నాడు: "అయితే ఈ అక్కచెల్లెళ్ళ పరిచయం ఎన్నో జన్మలనుండీ వున్నదన్నమాట.''

శారదకు ఆమాట అంత ప్రియంగా లేదు. తన అయిష్టత మాటల్లో చూపక పోయినా జవాబివ్వక కూర్చుంది.

"మాట్లాడవేమి? అంత ఆప్యాయంగా అక్క వ్రాసిన లేఖ చెల్లెలికి రుచించలేదా ఏమిటి?"

"అక్కా — చెల్లెలున్నూ! ఎవ రా అక్క! ముక్కూ మొగ మెరుగని ఒక అక్క ఎవరో వుంటే, నాకు ఒరిగే దేముంది?''

''నీకు కష్టం కలిగించనిదీ, నిన్ను అభిమానించేదీ ఒక అక్క వుంటే సంతోషంగా వుండదూ?''

"ఉంటుంది, కానీ — నిజంగా యీ అక్క నామీలే చలపోస్తుందని అనుకో గలనా? సవతి ఏరళ్ళు ఎప్పుడైనా కలిసే దుంటుందా?"

"ఎంతమాటన్నావు? నీకు సవతి ఎలా అవుతుం దామె యిప్పుడు. నీమీద గాని, నామీదగానీ హక్కు చెలాయించే అధికారం ఏముం దామెకు?"

"మరయితే పదేళ్ళక్రిందట తెగతెంపు లయిన బంధుత్వం ఈమధ్య ఎందుకు మళ్ళా కదలాడిందో కాస్త చెప్పండి నాకు?''

వెంకటేశ్వర్లు సందిగ్ధంలో పడ్డాడు. తను ఏది చెప్పినా శారద విశేషార్థాలే తీస్తుంది. అయినా సమాధానం చెప్పకనూ తప్పదు. "చూడు శారదా! నా మనస్సును నువ్వు యీనాటికీ అర్థంచేసుకోలేదు. ఇన్నేళ్ళ కాపురం చేస్తూకూడా నన్ను సందేహిస్తున్నావంటే నీగురించి ఏమను కోవాలో తెలియడంలేదు. శ్యామల యిప్పుడు నాకు భార్యగాదు. నా ప్రేయసి కాదు. ఆమె ఒకస్త్రీ. ఏదో కారణాన నాకూ ఆమెకూ వివాహయోగం పట్టింది. మరేదో వైపరీత్యంవల్ల ఎడబాపులూ జరిగిపోయాయి. ఆమె నాకు ఏమీ కాదిప్పుడు. అంత మాత్రంచేత నిస్సహాయ స్థితిలోవుండి మాటసహాయం కోరితే కాదంటావా? నిన్ను సహాయం అడిగినా కాదనలేవే. ఆమె స్థితి తలుచుకుంటే ఎంతటి కఠినచిత్తుడైనా కరుగక తప్పదు. ఇంతకూ నే నేమీ నా యింట్లోది ఎత్తి పెట్టలేదు. ఎట్టి నీచానికీ ఒడిగట్టలేదు. మానవత్వపు కనీస ధర్మం ఏదో అది నెరవేర్చడం కంటే మరే ఘనకార్యమూ చేయలేదు.''

ఆమె కోపం తెచ్చుకోవాలన్నా వీలవ లేదు. 'శ్యామల తన కేమపకారం చేసింది? అనుమానం ఫెనుభూతం అయి వివిధ రూపాలు ధరిస్తున్నది తప్పించి, ఇప్పటి వరకూ శ్యామల తన కాపురంలో ప్రవేశించలేదే! ఆమెను ఎందుకు ఆడిపోసు కోవాలి! ఆవిడ పేరు వింటే ఎందుకు ఉలిక్కిపడాలి!'

మౌనంగా వున్న శారదతో మళ్ళా యిలా అన్నాడు వెంకటేశ్వర్లు: "బ్రతుకులో ఆనందాన్ని చేతులారా జారవిడుచుకున్న తన దురదృష్టాన్ని నిందించుకుని

కుములుతూన్నదే కానీ యిన్నేళ్ళ మధ్య మన కుటుంబం వైపు కన్నెత్తి చూసిందా చెప్పు! తనే రభస చేసి యీ సంసారంలో ప్రవేశించ తలచుకుంటే నీవూ, నేనూ ఎన్ని చిక్కులు పాలయే వారమో ఆలోచించు! మన కాపురంలో ఆమెకు ప్రవేశింప సాధ్యం కానున్నా, కలతపెట్టడం పెద్ద ప్రయాస ఏమీ కాదు కదా! ఆట్టి దుష్టబుద్ధి ఆమెలో లేదు కనుకే మనం శాంతితో వున్నాము. నిజమా కాదా చెప్పు?"

శారద భర్తమాటల్లోని సంభవాసంభవాల గూర్చి దిగాలుపడి ఊహించుకుంటున్నది. 'అవును. ఆమె మంచి స్వభావం ఈ లేఖలో బోధపడుతున్నది'

"శారదా! నీవే ఆమె స్థానంలో వుండివుంటే నీస్థానంలో వున్న ఆమెను గూర్చి నీవు ఎంత బాధపడేదానివో ఊహించుకో. మరో స్త్రీ తన స్థానాన్ని పుచ్చుకొని సకల సౌఖ్యాలు, విభవం అనుభవిస్తూ వుంటే తను విరాగియై, కోరికలను చంపుకొని చూస్తూ వుండగలదా? ఊహూఁ; నీవా సహనం చూపగల వనుకోను. నీకు కోపం వస్తే రానీగానీ, ఆమె దయాగుణం వల్లనే నీవూ నేనూ పిల్లలూ ఈనాడు నిశ్చింతగా కాలం గడుపుతున్నాము. మన యీ సుఖం, ఆనందం చూసి ఆమె కంట నీరు పెడితే మనం ఎత్తేర్లేవారమేనా? పరిస్థితులను సరిగా అర్థం చేసుకో శారదా!"

"నిజమే, ఆమె జీవితంలో తప్పుటడుగు వేసి తన సుఖాన్ని దూరం చేసుకుంది. అయినా ధైర్యంగా నిలబడ్డం ఆశ్చర్యమే కలిగిస్తోంది! పాపం ఆమె తల్లిదండ్రులింట ఎన్నాళ్ళు వుంటుంది! వాళ్లు సరిగా చూస్తారా?"

"అంత పనీ జరిగింది! తల్లిదండ్రులీమెను అనరాని మాటలు అని ఇల్లు వెడలగొట్టారు శారదా!"

"అయ్యో పాపం! ఎక్కడికి వెళ్ళింది! ఎవరింట తలదాచుకుంది?"

"ఆ మాట నీ వెందుకడుగుతున్నావు. ఆమె నీ కేమవుతుందని? మీదుమిక్కిలి సవతికూడా అంటునావు. ఏదో జరుగుతుంది పుట్టించినవాడు, వివేకమిచ్చినవాడు తిండి పెట్టడా? రక్షణ ఇవ్వడా?"

"ఏం మాటలండీ? ఏమయిందో చెప్పరాదా?"

"చెప్పడాని కేముంది? కొంచెం చదువుకుంది. ఏదో నౌఖరీ చేసుకొనే ఏర్పాటు జరిగిందట తల్లీ తోడూవంటి ఎవరో దయార్ద్రహృదయులు ఆశ్రయమిచ్చేరట! అన్నదమ్ములవంటి ఏ సహృదయులో ఉద్యోగము చూపి ఆమె జీవనానికి ఆధరువు కల్పించేరుట. ఏదో జరిగింది. ఆమె భారం మన మేమీ మోయనక్కరలేదు. నిన్నూ పిల్లల్నీ వేధించే ఎట్టి ఘోరమూ చేయడానికి ఆమె సిద్ధపడదు. భయం పెట్టుకోకు."



"ఎందుకండీ మీరు మరీ అన్యాయంగా నన్నుఅలా అంటారు! నేను మాత్రం ఏమన్నాను. నామనస్సులోనేయింత కాలమూ అనుమానాలతోఆందోళన పడ్డాను కానీ పైకి ఎవర్నన్నా ఏమైనా అన్నానా?" అంటూ శారద కంఠంలో బాధను ధ్వనింపజేసింది.

ఆమెలో మార్పును వెంకటేశ్వర్లు అర్థం చేసుకున్నాడు. శ్యామల లేఖను ఆధారంగా చేసిన ప్రసంగం కొంత మంచి కూర్చిందని సంతోషించేడు.

"నిన్నేమీ అనడం కాదు శారదా! ఆమె మన కెట్టి చెడూ కల్గించేది కాదు. వట్టి భయాలు పెట్టుకోకు. నీ తోటి స్త్రీగా ఆమెమీద సానుభూతి చూపించు. అది నీ కనీసధర్మం."

ఇంత కాలమూ నిర్లక్ష్యభావంతోనూ, కోపంతోనూ తాను భర్తపట్ల ప్రవర్తించడం చాల తప్పిదమే అని భావించింది. ఆమె పశ్చాత్తాపంతో క్షమాభిక్ష వేడుకోవాలనుకుంది. కానీ పెక్కు మాటల్లో చెప్పలేక ఒక వాక్యంలో తన మనసు విశదం చేసింది. "నా పొరపాట్లు క్షమించండి."

తన భార్యనోట యీ మాట వస్తుందని వెంకటేశ్వర్లు కలలోనైనా అనుకోలేదు.

ఆ మధ్య శారద ఇంట్లో చేసిన చిన్నచిన్న రగడలు ఇంకా మరపునకు రానేలేదు 'ఆమేనా యీనాడు క్షమాపణ కోరింది?' అనుకున్నాడు ఆయన హృదయం ఆర్ద్రమయింది.

శారదను దగ్గరగా తీసుకొని గుండెలకు హత్తుకున్నాడు. "క్షమించడానికేముంది. శారదా! మంచి తలపెడ్తే మేలు చేస్తాడు భగవంతుడు. చెడు కీడు తెస్తుంది! కలలోకూడా చెడు తలవనేకూడదు."

పతి ప్రేమాదరాల్లో ఎన్నో నెలల తర్వాత మళ్ళా అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించింది శారద.

శారద నిర్లిప్తంగా వుంటూ వస్తున్నది. అతి చనవుగాని ఆప్యాయతగాని కూడదు. అలాగని దూరంగా వుండనూ లేదు. గందరగోళాలు లేక కాలం గడుపుతూంది.

వెంకటేశ్వర్లుమాత్రం భార్యపట్ల ఒకే ఆత్మీయత చూపుతున్నాడు. ఆనాడూ యీనాడూ ఒకే విధంగా వున్నాడు శారదపట్ల.

శ్యామల వ్రాసిన లేఖ చదివినతర్వాత వెంకటేశ్వర్లులో ఆమెపట్ల చాల విచిత్ర భావం పెంపొందింది. నిస్వార్థమైన ఆమెహృదయం, శారద విషయమై ఆమె వ్యక్తపరచిన శ్రేయోచింతనము వెంకటేశ్వర్లును కదిలించేయి.

ఏదో మమకారం ఆమెవైపు ఆకర్షించుతూ వుండడం అతనికి విస్మయంగానే వుంది

'శ్యామలను ఓమారు చూసివస్తే!... ఎక్కడుందో? ఎలా వుందో! అయినా యీ మనస్సుకు స్వేచ్ఛ నివ్వడమా?! వీల్లేదు. యీ ఆలోచన మంచిది కాదేమో.' అనుకున్నాడు –

## 3

కాలం ఏదో సంఘటనను సృష్టిస్తుంది. ఆ సంఘటన కారణంగా ఏదో విశేష పరిణామం ఏర్పడుతుంది.

శారద చూలాలు – మూడోపురుడు. పుట్టింటివారు తీసుకువెళ్ళ వీల్లేదు. వెంక




"వెనక్కి రమ్మంటే రావేం? జేబులో చిల్లిగవ్వలేదా"

శేక్వర్లు ఉద్యోగం చేస్తున్న ప్రదేశంలో మంచి ఆస్పత్రిలేదు

ఏ కష్టం వచ్చినా, సుఖంలోనైనా మేనల్లుడు మిక్కిలి సహాయపడుతూ వుంటున్నాడు శారద పురిటిభారంకూడా రామచంద్రంమీదే వేయాలని నిశ్చయించుకున్నాడు

మేనల్లునికి ఉత్తరం వ్రాసేడు. సుమారు రెండునెలలు శారద సంరక్షణ భారం వహించి సహకరించవలసిందని కోరాడు, ఖర్చువెచ్చాలకు అవసరమైనది పంపించాలని నిర్ణయించుకొన్నాడు.

రామచంద్రం తన కర్తవ్యంగా భావించి ఒత్తయ్యాను, ఇద్దరిపిల్లలినీ తనయింటికి తీసుకువచ్చేడు.

పురిటిరోజులు దగ్గరవగానే ముందు జాగ్రత్తకోసం శారదను ఆస్పత్రిలో చూపించి డాక్టరమ్మ సలహాతో ఆస్పత్రిలో చేర్చాడు

పురుడు రావడం చాలా కష్టమైంది. అందరి మనస్సులూ ఆందోళనాభరితాలయాయి మామకు టెలిగ్రాం ఇచ్చినా గాభరా మిగులుతుంది కానీ వేళకు వచ్చి ఆదుకోలేడని ఆ పని మాని, దైవంమీద భారం వుంచి ధైర్యంగా నిలబడ్డాడు

పిల్లల అదృష్టంవలనా, వెంకటేశ్వర్లు భార్యపై చూపే మక్కువవల్లా, రామచంద్రానికి మాట దక్కే యోగం వుండడంవల్లా గండం గడచి మనుషుల్లో పడింది శారద.

మగపిల్లవాడు కల్గడం మరీ సంతోషదాయక మయింది ఆపరేషను అయి బెడ్‌మీదకు వచ్చిన మరో గంట తర్వాత రామచంద్రాన్ని లోనికి తీసుకు వెళ్ళింది భార్య.

శారదను చూసి తిరిగి యింటికి వస్తున్నాడు రామచంద్రం. హాలు దాటి బయటకు వస్తూంటే శ్యామల ఎదురయింది

'శ్యామల! శుభ్రజ్యోత్స్నమూర్తి శ్యామల! వ్యాధిగ్రస్థుల బాధోపశమనం చేసే ప్రియసేవిక శ్యామల! ఈవిడ ఇక్కడి కెలా వచ్చిం!' దనుకుంటుండగానే ఆమె దగ్గరయింది.

"నమస్కారం రామచంద్రం గారూ!" అంది చిరునవ్వుతో.

"నమస్కారం! మీ రిక్కడున్నా రేమిటి!" అన్నాడు ఆశ్చర్యంతో.

"నాకు యిక్కడికి బదిలీ అయి వారం రోజు లయింది మీ చిరునామా తెలుసుకోవా లనుకుంటూంటే మీరే కనిపించారు ఇలా వచ్చా రేమిటి? మీవా రెవరైనా వున్నారా?" ప్రశ్నించింది శ్యామల.

"మా మామయ్య భార్య..." అని మాట పూర్తి చేయకమునుపే అర్థం చేసుకొని, తనే మిగిలినవాక్యం పూర్తి చేసింది. "ఆపరేషన్ కేసా? రెండు గంటలకు పురుడు వచ్చింది. ఆవిడా?" ఎక్కువగా మాట్లాడలేక పోయింది. ఆమె మనస్సు పరిపరి విధాలుగా ఆలోచించసాగింది ప్రక్కనున్న రెస్ట్‌రూమ్ లోనికి తీసుకొనివెళ్ళి కూర్చోపెట్టింది రామచంద్రాన్ని.

"నేను ఇక్కడికి రావడం చిత్రంగా వుంది. మీ అత్తయ్యకోసమే భగవంతుడు నన్ను ఇక్కడికి రప్పించేడా అన్పిట్టుంది. నన్ను పరిశోధించడానికీ, నా నిజాయితీని పరీక్షించడానికీ ఇంతకంటే మించిన సమయం లేదనుకున్నాడేమో! ఆపరేషన్‌దగ్గర డాక్టర్‌తో ఉన్నది నేనే. ఎందుకో నా గుండె ఆ సమయంలో ఎంత బాధపడిందనుకున్నారు. ఏ కారణమో అనుకున్నాను. ఏదో అనుబంధం, సోదరీ బంధం నన్ను ఆమె ప్రాణభిక్ష పెట్టమని భగవంతుని ప్రార్థించేటట్లు చేసింది. ప్రతి ప్రాణి ఆపదలోనూ నేను దేవుని 'కాపాడ' వేడుతాను. కానీ యీనాడు నేను పొందిన మధన వర్ణనాతీత మయింది. భగవంతుడు నా ప్రార్థన ఆలించాడు; ఆమె బ్రతికింది. మీ అందరికంటె ఇప్పుడు నా కెంతో ఆనందంగా వుంది. ఆమెను చూడడానికే మళ్ళా వస్తున్నాను.

"అయితే ఈ వివరాలు పురుడు తీరే వరకూ ఆమెకుగాని, మీ భార్యకుగాని

చెప్పవద్దు. తరువాత ఎలాగా తెలుస్తుంది లెండి. అన్నట్లు మీ భార్యకు మన బంధుత్వం తెలీదనుకుంటా."

"అవునౌను, తెలీదు. సరిగా_మిమ్మల్ని పోల్చలేదులెండి." అన్నాడు రామచంద్రం. శ్యామల ఔదార్యగుణానికి మనసులోనే మెచ్చుకున్నాడు. వెళ్ళివస్తానని ఇల్లు చేరుకున్నాడు.

* * *

శారదను అత్యంత ఆదరంతో సేవిస్తున్నది కొత్త నర్సు శ్యామల. రోజూ పిల్లలు తల్లిదగ్గరకు రాగానే శ్యామల ఆ పిల్లల్ని దగ్గరకు తీసుకొని ముద్దాడుతుంది, ఏవో బుజ్జాలు అందిస్తుంది చాకలెట్లో, బిస్కత్తులో, పకోడీపొట్లాలో సిద్ధంచేసి వుంచుతుంది ఆ వేళకు. ఏదో ఆత్మీయత ఆమెను ఆ తల్లీపిల్లలవైపు ఆకర్షించసాగింది.

శారదకూడా ఆమెను అక్కవలె అభిమానించడం మొదలుపెట్టింది. అప్పటప్పటా తీరికసమయాల్లో శారద వద్దకు వెళ్ళి కూర్చొని కబుర్లాడేది. అప్పుడు కొంతసేపు కలివిడిగా వుండి, మరో కొంతసేపు పరధ్యానమయి ఏదో దిగులు అంతర్యంలో దాచుకొని కుమిలినట్లుండేది శ్యామల

శారధ ఒకటిరెండు దఫాల అడిగింది కానీ తప్పించుకుపోయేది శ్యామల. ఎప్పుడో ఒకప్పుడు యీ ఉదంతం తెలియకపోదని శ్యామల ఎరుగును.

* * *

సుపుత్ర జననం గురించి శుభలేఖ వ్రాసేడు రామచంద్రం. వెంకటేశ్వర్లు నాల్రోజులు శలవు తీసుకొని పదకొండో రోజునాటికి వస్తానని వ్రాశాడు. శారద తల్లి శుభలేఖ అందిననాడే బయల్దేరి విశాఖ చేరుకుంది. ఆమె రాకవలన రామచంద్రం భార్యకు సహాయంగా వంటా వార్పునకు ఇబ్బందిలేక ఆసరా అయింది. వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు తాము రావడానికి అనవకాశం తెలుపుతూ జాబు వ్రాశారు.

శారదనూ బిడ్డనూ తొమ్మిదోరోజున డిశ్చార్జి చేశారు. శ్యామలకు తదితర సేవికలకు కృతజ్ఞత చెప్పి ఇంటికి వచ్చింది శారద. తమ ఊరికి వెళ్ళేలోగా మళ్ళా కల్సుకుంటానని చెప్పింది. శ్యామల గంభీరంగా మౌనం వహించి ఆమెను సాగనంపింది.

ఆమె మనస్సంతా ఏవో పాతగాధలతో కల్లోలం కాసాగింది. తన చిన్ననాటి తీయని కలలు, వైవాహిక జీవితపు మాధుర్యాల అనుభవాలకోసం ఎదురుచూచిన తన కాంక్షలూ సఫలం కాకుండానే బలీయమైన విధి మందలింపు జ్ఞప్తికి వచ్చినప్పుడు శ్యామల కంట నీరు పెట్టుకొని కూర్చుండిపోతుంది. తన దురదృష్టానికి లోలోన కృంగిపోతుంది

తను వివాహితగాని, అవివాహిత వలెనే కాలం గడుపుతూన్నది వయస్సు

కోర్కెలపరవళ్ళు త్రొక్కితే గుణ్ణానికి కళ్లెం వేసినట్లు సహనశీలిగా కాలం గడుపుతున్నది. ఏనాడైతే కాపురాన్ని తెగతెంపులు చేసుకువచ్చిందో-తనబాల్య చాపల్యమో. తొందరపాటుతనమో-పొరపాటు చేసినపుడు తల్లిదండ్రులైనా తనకు హితమార్గం చూపి కాపురం నిలబెట్టలేదు. సురలా మరోపెళ్ళి చేస్తామన్నారపుడు. కానీ దోషి అయినట్లు తన అంతరాత్మ పదేపదే హెచ్చరించేది.

కర్మదాస్యం చేస్తూ పుట్టింట పడివుంది తను. ఇప్పుడు మళ్ళా యీ అనుబంధమేమిటీ? ఎందు కీనాడు మళ్ళా యీ కుటుంబానికి దగ్గరవుతున్నది తను? భగవంతుని ఉద్దేశ మేమిటో?

శ్యామల తన జీవితంలో వస్తున్న పరిణామాలను తలచుకొంటూ విస్మయచిత్త అవుతూ వుంటుంది అప్పటప్పటా.

అనుకున్నట్లు వెంకటేశ్వర్లు విశాఖ చేరుకున్నాడు. పిల్లల్ని చూసి ముచ్చటపడ్డాడు శారద పురిటిగండం గడచి ఆరోగ్యం కోలుకోవడం అదృష్టంగా భావించాడు.

శారద హాస్పిటల్ విశేషాలు చెప్తూ, తనకు బాగా నచ్చిన ఒక కొత్తవ్యక్తి గురించికూడా చెప్పింది. ఆమే నర్సు. ఆమెగురించి పొగిడిచెప్పింది.

అక్కా చెల్లెళ్ళా ఎంతో ఆప్యాయత చూపిందని వివరించింది. మర్నాడు ఆమెను విందుకు పిలవమని భర్తను కోరింది. సరేనన్నాడు వెంకటేశ్వర్లు.

రామచంద్రం, వెంకటేశ్వర్లు నర్సుల క్వార్టర్సుకు బయల్దేరారు. దార్లో వెంకటేశ్వర్లుతో నర్సుగురించిన విశేషాలు వివరించేడు రామచంద్రం. కాస్తసేపు సంభ్రమమూ తత్తరపాటూ చెందాడు వెంకటేశ్వర్లు అనుకోని యీ సంఘటనకు ఏదో ప్రయోజన ముందనుకున్నాడు.

క్వార్టర్సులో ఆమెలేదు. డ్యూటీ నుండి నాలుగ్గంటలకు వస్తుందన్నారు ప్రక్కనున్నవారు.


రామచంద్రాన్ని యింటికి వెళ్ళమని తాను అలా తిరిగివచ్చాడు హృదయగతమైన ఎన్నో అనుభూతులతో, ఆకాంక్షలతో వెంకటేశ్వర్లు ఒక్కడే నర్సు కోసం వెళ్ళాడు.

శ్యామల అప్పటి కప్పుడే బసకు వచ్చి జడ అల్లుకొని మితంగా పూలు తురుముకుంది. చీర కట్టుకొని అప్పుడే ముస్తాబు పూర్తిచేసుకొని ఏదో పుస్తకం విప్పి కూర్చుంది

ఇంతలో వెంకటేశ్వర్లు వెళ్ళాడు. "శ్యామలా!" అని పిల్చాడు.

ఆ పిలుపు - ఒకదశాబ్దం క్రిందట వయసు తొలకరింపుల మధుర వసంతములో కోయిలకూత ఏమో-మధురిమలు చిలుకరించిన ట్లయింది.

లేచివచ్చి చూసింది. తనకళ్ళను తను నమ్మలేకపోయింది దుఃఖమూ ఆనం




దమూ ఒక్కపెట్టున ముంచుకు వచ్చేయి. ఎవరు? ఎవ రీయన? వేదోక్తంగా మంగళసూత్రధారణ చేసిన ఆనాటి భర్తేనా? అత్తవారింటి నరకయాతన పడలేక, ముందువెనుక లాలోచించని కఠోరమైన నిర్ణయం చేసుకున్న తర్వాత "శ్యామా! జరిగింది మరచిపో; నేను లేనప్పుడు అదంతా జరిగింది. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తాను. ఇకమీదట ఇక్కడ ఉండపద్దు. నేను ఉద్యోగం చేసిన ఊరు పోయి ఉందాం మనం," అని బుజ్జగించ వచ్చినప్పటి దయార్ద్ర ప్రేమమూర్తియేనా? ఎవ రీయన?!'

వెంకటేశ్వర్లు లోనికి వచ్చి కుర్చీమిద కూర్చున్నాడు మైమరచివున్న శ్యామల ఒక్క ఆదటున ఆయన పాదాలవద్దపడి భోరున ఏడ్వసాగింది!

వెంకటేశ్వర్లు కన్నులుకూడ ఆర్ద్రమయాయి. ఆ దుఃఖంలో ఎన్నో గత గాథలూ, గంభీర స్మృతులూ నిక్షిప్తం అయివున్నాయి.

శ్యామలను లేవనెత్తేడు. ఎదుటి కుర్చీమీద మౌనంగా కూర్చుని కన్నీరు తుడుచుకోసాగింది.

అనిర్వచనీయమైన ఎన్నో భావపరంపరలు కదలాడాయి వారిమధ్య. వాటిలో బహుకొద్ది మాత్రమే వాగ్రూపం పొందేయి ఇంకెన్నో మూగవై వారి గుండెల్లోనే అణగి వుండిపోయాయి.

వారిమధ్య అధికమైన సంభాషణ జరక్కపోయినా శ్యామల హృదయావేదన తెలిపే కొన్నిమాటలు మాత్రం వెలువడ్డాయి.

తనకు మాంగల్యం ప్రసాదించిన

మనీషిగా వెంకటేశ్వర్లును గౌరవిస్తుంది ఆమె. ఆ మంగళసూత్రం తన్ను అపవాదులనుండి అవహేళననుండి రక్షించి గౌరవిస్తూంది.

గతగాథలు కొందరు త్రవ్వజూస్తే ఆ కరుణామయమైన గాథలు వినిపించడానికి నిరాకరించినప్పుడు ఎవరూ ఏమీ చేయలేకపోయేవారు.

మూడేళ్ళ తన ఒంటరి బ్రతుకులో, అంటే ఉద్యోగపు జీవనంలో రానురాను ఏదో నైరాశ్యం తలఎత్తుతున్నట్లు అనిపించింది. బ్రతుకు తీపి ఎక్కడా పొందే అవకాశమే కలగలేదు.

ఆత్మీయభావం, రక్తసంబంధం, మమతానుబంధం హృదయం కోరుతూంది. ఆ బంధుప్రేమ, వాత్సల్యభావం తనకు దూరమైపోయాయి ఆ లోపం పూరించబడక, తన జీవితంలో నిండుదనం కానరాదు. మనస్సు వేడుకపడలేదు. జీవితం ప్రమోదభరితంకాదు.

శ్యామల తన మనోవేదన ఆయనకు సంక్షిప్తంగా నైనా వెల్లడించక మనశ్శాంతి పొందలేదు.

"ఏ శాపకారణంగానో నేను మీకు దూరమయేను; కానీ విధి నాకు ప్రసాదించిన యీ మాంగల్యం స్థిరంగా నిలచి వుంది. నా శరీరానికి గౌరవాన్నీ, నా శీలసంపదకు భద్రతనూ అనుగ్రహించిందీ మాంగల్యం;

నేను దూరంగా వెళ్ళిపోయినా, మీరు దూరంగా వుండిపోయినా, నేను దీన్ని ధరించి వున్నన్నాళ్ళూ మనమధ్య దైవికమైన అనుబంధం కల్గేవుంటుంది.

అయితే మిమ్మ ప్రార్థించేది ఒకటుంది తాళికట్టిన స్త్రీగా, అర్ధాంగిగా నన్ను మరచిపోవలసిందని ప్రార్థిస్తున్నా. 'శ్యామల' కేవలం దురదృష్టవంతురాలైన స్త్రీ; పరోక్షంగా మిమ్ము ఆరాధించుతూ బ్రతుకు గడిపే ఆరాధికమాత్రమే.

శ్యామల ఒక సేవిక, ఒక బంధువు, అంతే. ఎప్పుడైనా వచ్చి మిమ్మూ, కుటుంబాన్నీ చూచి ఆనందించే అనుమతీ, అవకాశం యివ్వండి. ఈ సమయంలో నాదో చిన్న కోరికా వుంది. మీ దంపతులు దయతలుస్తే నా కాంక్ష తీరుతుంది

మీ పాపల్లో ఒకబిడ్డను నా దగ్గర చదువు చెప్పించా లనుంది అంతకంటే యీ దీనురాలు మి మ్మేమీ బాధించదు."

వెంకటేశ్వర్లు మనస్సు ఎంతో జాలిపడింది. ఆమె దయనీయమైన స్థితికి ఎవరు కారకులు? తనకూ ఎదో కొంత పాలుంది. తన ఉపేక్షాభావము యీమె ఒంటరితనానికి కొంత కారణం కాకపోదు. యీ తప్పిదానికి, యీ అక్రమానికి ఏ పుణ్యలేశమో జరగవద్దా! అయితే పిల్లను యీమెవద్ద వుంచడానికి తనొక్కని సమ్మతే చాలదు; శారద అంగీకరించాలి. అది సంభవమా అను శంక కలిగిందాయనకు. అయినా అత నాశను వదులుకోలేదు.



"అలాగే శ్యామలా! నువ్వు రేపు కోర్కె ఫలించవచ్చు. రేపు నిన్ను భోజ బాలసారెకు వచ్చినప్పుడు, లేక మరో నాటికి రమ్మని ఆహ్వానించడానికి మీ నాడు శారదను కదుపు. బహుశా నీ చెల్లెలు పంపగా నేను వచ్చాను.

"నా కెంతో ఆనందంగా వుంది. మిమ్మల్ని మళ్ళా యింతలో చూడ గల్గుతా ననుకోలేదు. మీ దయవుండబట్టి వచ్చారు. యీ పవిత్రమైన మీ దయా దృష్టి ఎల్లప్పుడూ నామీద బరపుతూం డండి. రేపు వస్తా; చెల్లిని తప్పక ఒప్పిస్తా. భగవంతుడు కరుణిస్తాడని నాకు నమ్మక ముంది."

వెంకటేశ్వర్లు ఇంటికి తిరిగివచ్చాడు.

* * *

శ్యామల వచ్చింది. వెంకటేశ్వర్లు లోన గదిలో వున్నాడు. శారద వెళ్ళి భర్తతో చెప్పింది: "ఏమండీ! నర్సు వచ్చారు."

వెంకటేశ్వర్లు నిర్లిప్తంగా కూర్చు న్నాడు.

"లెండి, వెళ్ళి పల్కరించండి. నా కెంతో సాయం చేసింది. ఆమె లేకుంటే ఏమయ్యేదాన్నో!"

అప్పటికీ అతను చలించలేదు. అతని మనస్సు పరిపరివిధాల పోయింది. యీ ఘట్టం సుఖాంతం కావాలని, శుభ ప్రదమే అవాలని దేవుని ప్రార్థించాడు మనస్సులోనే.

"శారదా! నీ కో కొత్త వార్త చెప్పాల్సివుంది. నర్సు మన బంధుకోటి లోనిదే సుమా!"

"అలాగా! ఎవరుటా?"

"చెప్తా పద!"

నర్సు లేచి నిల్చుంది.

"చూడు శారదా! ఈమె నీ అక్క. తన స్థానం నీ కిచ్చి, తన జీవితాన్ని నీవంటి అనేకమందికి సేవ చేయడానికి వినియోగించే సుశీల...శ్యామల."


"ఆ ... నిజమా! ..." అని క్షణం నోటమాట లేక ఉండిపోయింది శారద. అంతా అయోమయంగా వుంది ఆమెకు. 'నిజంగా యీ స్త్రీ నిండుకాపురాన్ని వదలిపెట్టిందా? ఎంత మంచి మనసు! ఎంత దయ! నా కాపురంలో మళ్ళా చిచ్చుపెడుతుందేమోనని పలు శంకలకు కారణమైన స్త్రీ యీమేనా?

'ఆమె స్థానంలో అధిష్ఠించి, ఆమె ఆనందాన్నీ, ఐశ్వర్యాన్నీ అనుభవిస్తున్న నన్ను చూసి ఏమనుకుంటున్న దీమె? యౌవనంలోనే యీమె విరాగి ఎట్లా కాగలిగింది? కానీ వాస్తవంగా ఆమె సుగుణవతి కాకుంటే తనకోసం ఎందుకు వస్తుంది?'

"అక్కా!'' అంటూ శారద ఆప్యా యంగా శ్యామలను కౌగలించుకుంది.

ఇరువురూ ఏవో గత జన్మానుబం ధాలు స్ఫురణకు తెచ్చుకొన్నట్లు సహో దరభావంతో తనువులు పులకింపగా కొన్నిక్షణాలు మైమరచివున్నారు.

"ఇన్నాళ్ళూ నాకు తెలియకుండా ఇంత గాథను మీ గుండెల్లో ఉంచుకు న్నారా? ఏం, నే నేదో భయపడతా ననా? లేక మిమ్మల్ని గుమ్మంలోనుండే వెళ్ళగొట్టా ననా?" అంది శారద.



శారద మాటలకు శ్యామల పెదాలపై చిరునవ్వు చిందులాడగా ఆనందపులకిత గాత్రయై అంది :

"లేదు చెల్లీ ! నా చెల్లెలు అంతటి కఠినురాలు, అవివేకురాలు కాదనేసంగతి నా మనసుకు తెలుసు. ఆ ధైర్యంతోనే, ఆ ఆత్మీయభావంవల్లే మీ దంపతుల ఎదుటికి వచ్చి నిల్చున్నాను !

"అమ్మా ! ఎవరి అదృష్టాలు వారివి. ఒకరి సౌభాగ్యం ఇంకొకరు తీసుకోలేరమ్మా ! ఒకరి సంతోషం మరొకరు దోచుకోవడం సాధ్యం కాదు చెల్లీ ! ఇవి నా అనుభవాలు తెలిపిన పాఠాలు. దురాశలు మనిషిమీద ఏదోనాడు గట్టిదెబ్బ తీస్తాయి. నీకు మాత్రం మంచి చెడ్డలు తెలియవా ? నీవెందుకు నా మీద కోపగిస్తావు ? నేను 'కలలోకూడా అలా తలచలేదు చెల్లీ !"

శారద ఆ మాటలు వింటూ ఆమె హృదయౌన్నత్యానికి ఆశ్చర్యపడింది.

రామచంద్రం భార్య లలిత కాఫీలు తెచ్చి అందించింది. వెంకటేశ్వర్లు, రామచంద్రం కుర్చీల్లో కూర్చున్నారు. శ్యామల, లలిత, శారద చాపలమీద కూర్చున్నారు.

"శారదా ! నీకు మరో సంగతి

కూడా ఆశ్చర్యం కల్గిస్తుంది. మీ అక్క మన లలితమ్మ పెద్ద తాతయ్యగారి కూతురు. అయితే చాలా రోజులయి లలితమ్మ నాన్నగారు పడమటే ఉద్యోగము చేశారు కనుక రాకపోకలు లేక పరిచయాలు లేవు. పైవార మెవరమూ కాము ఇందులో."

కొత్త బంధుత్వాన్ని లలిత సంతోషంగా ఆహ్వానించింది. చూచాయగా తెలిసిన బంధుత్వం సువిశదం కావడంతో శ్యామల యింకా చేరువయింది రామచంద్రం కుటుంబంతో.

బాలసారె జరిగిన తర్వాత విందు భోజనాలు పూర్తి అయేయి. వశీకరణం ఉన్నట్లు పిల్లలు శ్యామలను విడచిపెట్ట లేదు.

శ్యామల జీవితంలో కొత్త ఆశ తృప్తి పల్లవించినట్లయింది. ఆమె హృదయంలో గూడుకట్టుకొనివున్న దైన్యం క్రమంగా అదృశ్యం కాసాగింది. ఆమె మానసాకాశంలో ఇదివరకటి చీకటిభూతాల సంచారం క్రమంగా సన్నగిల్లిపోయింది. ఏవో కాంతిరేఖలు ఆమెలో సందడి చేస్తున్నాయి.

శలవలు పూర్తికాగానే వెంకటేశ్వర్లు ఉద్యోగానికి వెళ్ళిపోయాడు. నెలరోజులయేవరకూ శారద యింకా యిక్కడే వుండటానికి నిశ్చయమయింది.

— * *

మరో నాల్రోజుల తర్వాత ఒకనాటి ఉదయానే రామచంద్రం యింటికి వచ్చింది శ్యామల. ఆమె స్వభావం యింటిల్లిపాదినీ ఆకట్టుకుంది. సహజమైన ఆవిడ ఆత్మీయత పిల్లల్నీ పెద్దల్నీ అనురక్తుల చేసింది.

శారదపిల్లలు రమా, ఉమా ఎంతో చనువుగా 'దొడ్డమ్మా' అంటూ శ్యామల దగ్గర కూర్చొని కబుర్లాడసాగారు, ఆమె యిచ్చిన మిఠాయి తింటూ. ఆప్పూట్రిలోనే శ్యామల వారి మనస్సుల్లో స్థానం చేసుకుంది. పిల్లలంటే ఆమెకు సహజంగా మక్కువ. యీపిల్లలు ఆమెకు మరీ మక్కువ కూరుస్తున్నారు. వారు తన పిల్లలే అన్నట్లు ప్రవర్తింపసాగింది శ్యామల.

శారదకు ఆశ్చర్యం కల్గిస్తున్నది వాళ్ల చేరిక 'ఎక్కడిదీ చనవు? పది పదిహేను రోజుల పరిచయం యింతలా ఎలా పెనవేసుకుంది? ఈ వశీకరణశక్తి ఎక్కడ వుంది? ఆమె ఎందుకిలా ప్రవర్తిస్తోంది? తనకూ ఆమెకూ నిజంగా ఇట్టి సాన్నిహిత్యానికి అవకాశం వుందా?'

ఆమె మనస్సు అప్పుటప్పటా ఒక్కోక్షణం కీడుశంకించ తలపెట్టేసరికి వివేక చైతన్యం మళ్ళా స్వరూపజ్ఞానం ఇచ్చి మందలించడం చేసేది.

'త్యాగానికి శ్యామల ప్రతిబింబం. భర్తను గౌరవించడం ఎంత ముఖ్యంగా భావిస్తున్నావో యీమెనూ అంత అభిమానంతో చూడు. పెనిమిటి చెప్పింది

మరచిపోవద్దు ఎవరిపట్లా కీడు శంకించకు. మంచి తలుస్తే మంచి, కీడు తలుస్తే కీడు మనకే ప్రాప్తిస్తాయి.'

శ్యామల తన సోదరి ఆమెను అనుమానించడం, అవమానించడం అసంగతమైన పనులు' — అనుకుంది శారద.

శారద హృదయంలో శ్యామల ఒక ఆదరణీయమైన స్థానం పొందింది.

పిల్లల్ని తనతో పంపమంది శ్యామల. మళ్ళా సాయంకాలం యిల్లు చేరుస్తానంది

"తొమ్మిదిన్నర కావచ్చింది. మరో అరగంటలో వంట పూర్తవుతుంది భోజనం చేసి బయల్దేరుదురు గాని," అంది లలిత.

"అలా బాగుంటుంది. పిల్లలూ భోజనం చేసి బయల్దేరవచ్చు," అన్నది శారదగూడా.

భోజనా లయేక పిల్లల్ని తోడ్కుకొని రిక్షాలో కూర్చుంది శ్యామల. పిల్లల ఉత్సాహం చూస్తూ శారద దిగ్భ్రాంతితో వాకిట్లో నిల్చుండిపోయింది.

కథలూ కబుర్లూ చెప్తూ కాలమే తెలియకుండా పిల్లలతో గడపింది శ్యామల. ఆమె బయట ప్రపంచాన్ని మరచిపోయింది

బయట ఎండ పేలుస్తున్నది. శ్యామల పిల్లల్ని కొంచంసేపు పడుకోమని బుజ్జగించింది. అక్కా చెల్లెళ్ళు దొడ్డమ్మ మాటను శిరసావహించారు. తనూ పిల్లల ప్రక్కనే చారగోరింది

నిద్రపోయిన పిల్లల్ని చూస్తూంటే ఆమెకు ఏదోతలంపు కల్గింది. తనకూ పిల్ల లుంటే! .. ఊ హూం ... తన జీవితంలో అట్టి ఆశలేదు. తన మనస్సులోకి ఆ ఆలోచనే రావీల్లేదు. తన ఆదర్శమే వేరు."

ఉమ దగ్గరగా వచ్చి కౌగలించుకుని నిద్రపోయింది. శ్యామల ఒళ్ళు పులకరించింది 'ఏమిటీ అనుబంధం: ఎందుకీ అనుబంధం కలిసిందో!' అనుకోసాగింది శ్యామల.

పిల్లలు లేవకుండానే మిఠాయి, కారపు సామానులు పనిపిల్లచేత తెప్పించి వుంచింది. స్టౌ ముట్టించి నీరు పడేసింది. పిల్లలు లేవగానే ముఖాలు కడిగింది — జడలు వేసి పూలు తురిమింది పౌడర్లు అద్ది తిలకాలు పెట్టింది.

మిఠాయిలు తిన్నారు. బోర్నవీటా ఇచ్చింది.

"మిఠాయి బాగుందా ఉమా? ఏమమ్మా రమా!" అడిగింది శ్యామల

"చాల బాగుంది దొడ్డమ్మా!'' రమ.

"ఓ బాగుంది దొడ్డమ్మా!' ఉమ.

"మరయితే నే నోటి కోర్తాను. మీరు తీరుస్తారా ఆకోరిక?''

"ఏమిటో చెప్పు దొడ్డమ్మా ''

"చెప్పువేగం" అప్పచెల్లెళ్లు తొందర చేశారు.

"మరేమో మా యింట ఉండి పోకూడదూ మీరు?"

"ఎప్పుడూనా ?"

"అవును, ఉండ లేరా?"

"అమ్మో! మా అమ్మ కోప్పడదూ?" ఉమ.

"మా నాన్నగారు దెబ్బలాడరూ! చదువో మరి!" రమ.

"ఇక్కడే చదువుకోవచ్చుగా రమా! ఎంతో మంచి బళ్ళున్నాయిక్కడ. మన యింటికి దగ్గర్లోనే వుంది ఒక బడి."

"నాకయితే యిష్టమే గాని అమ్మా నాన్నా ఒప్పుకోవద్దా దొడ్డమ్మా!"

"నాతల్లే, అమ్మతో చెప్తా, నాన్న గార్నీ అడిగేస్తా!"

"విశాఖపట్నంలో చదువుకోవడం నాకు సరదాయే. రామచంద్రంబావా, వదినా ఉన్నారుగా యీ వూళ్ళో!"

"వాళ్ళూ ఉంటారనుకో; అయినా నువ్వు నాదగ్గరే వుండి చదువుకో."

"ఓ అలాగే; ఇక్కడే వుండి చదువుకోగల్ను;" రమ.

"మరయితే, తమ్ముడు నీ దగ్గర వుండడే అక్కా!" ఉమ.

"అవును దొడ్డమ్మా! తమ్ముడో మరయితే," రమ.

"అప్పటప్పటా వెళ్ళి తమ్ముడ్ని చూసి వస్తూందువుగాని. పట్నాల్లో చదువుకున్న పిల్లలు యిలాగే చేస్తూంటారు చాలమంది."

"తమ్ముడు పెద్దవాడయితే నాతోనే చదువుకోడూ దొడ్డమ్మా!" ఉమ.

"తప్పకుండా చదువుతాడు ఉమా, తమ్మా అంతా పెద్దవాళ్ళయి చదువు కుంటారు"

"ఇప్పుడు తమ్ము డేమిచేస్తున్నాడో! ఇంటికి వెళ్ళిపోదాము దొడ్డమ్మా!" ఉమ.

"అలా, నమ్మా, వెళ్ళిపోదాము. ఏమే రమా ?"

సాయంకాలం అయిపోయింది పద దొడ్డమ్మా! అమ్మ చూస్తూవుంటుంది."

శ్యామల తలుపు తాళం వేసి బయల్దేరింది.

* * *

పిల్లల సరదాలు చూస్తే శారదకు మతే పోతున్నది. మరో నెల్లాళ్ళు ఇక్కడ వుంటే వీళ్ళు దొడ్డమ్మను వదలి రాలేనట్టున్నారు అనుకుంది ఆమె అనుకున్నట్టే ఆ రాత్రి పిల్లలు దొడ్డమ్మ గురించే కలవరింతలు! శారద మనసులో కొంచం దిగులు తలెత్తింది కానీ నిద్ర మళ్ళా ఆ తలంపును మరపున పడేసింది.

* * *

చంటివాడికి నెలకో రోజు తక్కువ చేసి శారదనూ పిల్లల్నీ దిగబెట్టమని వెంకటేశ్వర్లు ఉత్తరం వ్రాశాడు.

బంధుమర్యాదలతో శారదనూ పిల్లల్నీ దిగబెట్టడానికి సన్నాహాలు చేశాడు రామచంద్రం. శారద తల్లి



తోడుగా వుంది. రైలుస్టేషను చేరు కున్నా రంతా.

ఇంతలో శ్యామల ఒక పెద్ద ప్యాకెట్‌తో స్టేషనులో వార్ని కల్సింది. శారదకు ఆ పేకెట్‌ను అందించి పిల్ల వాడ్ని చేతిలోకి తీసుకుని ముద్దాడింది. పెద్దపిల్లల చేతుల్లో చెరో రూపాయి వుంచింది. ఉన్నట్టుండి ఒకసారి

"చెల్లీ! మాట," అంటూ కొంచం ప్రక్కగా తీసుకువెళ్ళి కూర్చోపెట్టింది శారదను.

"చెల్లీ! నా దో కోరిక వుంది. తీరుస్తా వనే తలుస్తా," అంది శ్యామల.

"చెప్పు అక్కా! ఏము టంత కోర వలసింది నా దగ్గర?"

"తీర్చలేని దేమీకాదు. నేను ఒంటరి

దాన్ని. తల్లిదండ్రులకూ, బంధువులకూ దూరంగా వుండిపోయినదాన్ని. మీ అమ్మాయి రమనుగాని ఉమనుగాని నా దగ్గర వుంచుకొని చదివించాలని వుంది. ఏదో చిన్న సాయంగా, నా ఒంటరి జీవితంలో ఒక ఆశారేఖగా వుంటుంది. నా బ్రతుక్కు తృప్తి నిండుదనం కల్గుతాయి నా మాట చెల్లిస్తావు కదూ చెల్లీ !"

శారద మనస్సు పరిపరి విధాల పోయింది ఎటూ చెప్పలేక ఒక నిముషముమౌనంగా ఉండిపోయింది, "అక్కా! క్షమించు. ఉన్నపాటున ఔననిగాని, కాదనిగాని తేల్చి చెప్పడం సాధ్యం కాదిప్పుడే. వారి అభిప్రాయమూ అవసరమే కదా! వారితో మాటాడి వుత్తరం వ్రాయిస్తా. మరోలా అనుకోకండిఅక్కా!"

"ఆ మాట చాలు! నీ యిష్టమమ్మా. దరఖాస్తు పెట్టుకున్నా. ఎప్పుడు ఆర్డరు వేయిస్తే అప్పటినుండే నా కోర్కె నెరవేరుతుంది" శ్యామల కృతజ్ఞతా భావం వుట్టిపడేటట్లు అంది. శారద అందరివద్దా శలవు తీసుకుంది.

*　　*　　*

'శారద వచ్చింది. జీవితంలోమార్పు తీసుకొని మరీ వచ్చింది. శారద తను వుపై కొత్త అందాల పూలపరిమళాలు గుబాళించాయి. శారద కొత్తగా వుంది.

'ఆమె మనసు, వయసు, అందం, చందం వెంకటేశ్వర్లును ఇనుమిక్కిలిగా ఆకర్షిస్తున్నది. ఆమె బాహ్యసౌందర్యం కంటే ఆమె అంతర సౌందర్యం అతనికి ఉత్సాహం కూరుస్తున్నది. ఇదివరకటి శారద కాదీమె. మానవత్వపు జాలిగాధను అవగాహన చేసుకున్న మహిళామణి యీ శారద. ఆడ మనసు అగాధగాథను అవగాహన చేసుకున్న మానినీతిలకం ఈ శారద.

'ఈ యింట యింక చీకట్లు ప్రవేశించవు. ఆనందశాంతుల కాంతుల శోభలే వెల్లివిరుస్తాయి.' వెంకటేశ్వర్లు తృప్తిగా అనుకున్నాడు.

శారదా పిల్లలూ శ్యామలను తలవని రోజులేదు. తను ఇంటికి వస్తూంటే స్టేషనులో శ్యామల వినిపించిన కోర్కె గురించి ఓనాడు భర్తతో చెప్పింది శారద. వెంకటేశ్వర్లు ఆశ్చర్యపోవడం లేదుగాని, శారద మనసులో కల్గిన మంచిమార్పునకు ఆయన ఆనందించకుండా ఎలా వుండగలడు?

మంచిచెడ్డలు చర్చించుకున్నారు భార్యాభర్తలు.

శారద హృదయపూర్వకంగా 'రమ'ను శ్యామలదగ్గర చదువుకయి ఉంచడానికి అంగీకరించింది.

*　　*　　*

శ్యామల లేఖను గుండెలకు హత్తుకుంది. శారద వ్రాసిన ఆలేఖలో మమతా మానవతా జోడించివున్నా యని ఆమె అనిర్వచనీయమైన ఆనందానుభూతి పొందింది.

———